క్లుప్తంగా

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేట, శ్రీరాంపురం గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివిధ శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు 17 సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. వాటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఎంఈఓ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపద వస్తే వెంటే ఉంటాం

ఐక్యతను చాటిన పెద్దాపురం పాత్రికేయులు



చింటూ నగదును అందజేస్తున్న పెద్దాపురం నియోజకవర్గ పాత్రికేయులు

పెద్దాపురం: జర్నలిస్టులో ఏ ఒక్కరికి ఆపద వచ్చిన వెన్నెంటే ఉంటామని పెద్దాపురం సీనియర్ జర్నలిస్టులు పలువురు అన్నారు. పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రైమ్9 రిపోర్టర్ చింటూ ఉంటున్న ఇంటిలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ నేపథ్యంలో పెద్దాపురం నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ కలిసి ఆ కుటుంబానికి రూ.50 వేల నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులందరూ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్ర ఈఓగా సూర్యనారాయణ



టీవీ సూర్యనారాయణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్ర ఈఓగా సూర్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈఓగా పని చేస్తున్న డి.నాగమల్లేశ్వరరావు అనారోగ్యం కారణంగా దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దాంతో కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో ఈఓగా పని చేస్తున్న టి.వెంకట సూర్యనారాయణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సామర్లకోటలో బార్ సీజ్

సామర్లకోట: స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న అశ్వనీ బార్‌ను సీజ్ చేశారు. తెల్లవారక ముందే బార్ తెరుచుకొంటుందనే వార్తల మేరకు ఎక్సైజ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినా స్పందించక పోవడంతో ప్రత్యేక స్క్వాడ్ సీజ్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ కల్యాణ్‌చక్రవర్తి స్థానిక విలేకర్లకు తెలిపారు. బార్ ఉదయం 10 గంటలకు తెరచి 12 గంటలకు మూసి వేయవలసి ఉండగా నిబంధనలను పాటించడం లేదనే ఫిర్యాదుల మేరకు 20 రోజుల క్రితం నోటీసులు ఇచ్చామని, అయినా ఎటువంటి స్పందనా లేక పోవడంతో సీజ్ చేశారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ శివారు గంగనాపల్లికి చెందిన పిల్లా వాడపల్లి, అయినవిల్లి లక్ష్మి తమ మోటార్ సైకిల్‌పై కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు వస్తున్నారు. గొల్లప్రోలు వైజంక్షన్ వద్ద మరో మోటార్ సైకిల్ ఢీకొనడంతో వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్సుకు సమాచారమిచ్చారు. తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో క్షతగాత్రులను హైవే మొబైల్ సిబ్బంది సన్నిబోయిన అప్పన్న తమ వాహనంలో పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. హైవే మొబైల్ సిబ్బందిని పలువురు అభినందించారు.

పెద్దాపురం: స్థానిక సుధా ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్ర గాయాల పాలయ్యారు. పెద్దాపురం ఎస్‌ఐ వి.సురేష్ కథనం ప్రకారం వివరాల ప్రకారం.. సాయికృష్ణ (25) మేఘన (24) ఇరువురు బైక్‌పై వెళ్లుతుండగా లారీని అదుపుతప్పి వెనుక నుంచి బలంగా ఢీ కొట్టారు. దీంతో తీవ్రగాయాలైన ఇరువురిని స్థానికులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలి

కొత్తపల్లి: సమాజంలో ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని సర్పంచ్ పాలని దొరబాబు అన్నారు. వాకతిప్పలో ఉన్న పద్మశాలి రామాలయం వద్ద బుధవారం సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అమ్మా.. గౌరమ్మా..

- ఘనంగా గౌరీశంకరుల మహోత్సవాలు
- ఆకట్టుకున్న శక్తి వేషధారణలు



కొత్తపల్లిలో గౌరీదేవి, నందీశ్వరుని ఊరేగిస్తున్న భక్తులు



రాక్షసిని సంహరిస్తున్నట్టుగా శక్తి వేషధారణ

కొత్తపల్లి: సంప్రదాయంగా వస్తున్న గౌరీశంకరుల మహోత్సవాలను మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీటు వీధిలో నెల రోజులుగా తెలుగింటి ఆడపడుచు, ఆరాధ్య దైవంగా విశిష్ట పూజలందుకుంటున్న గౌరీశంకరులను మేళతాళాలు, బాజాభజంత్రీలతో ఊరేగించారు. ఏటా కార్తిక మాసంలో గ్రామం పాడిపంటలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, మానవుని జీవనాధారమైన వరి దుబ్బును గౌరీదేవిగా భావించి కొలుస్తారు. కార్తిక పౌర్ణమి నెల రోజులుండగా, వరిదుబ్బుకు ఉపవాసం పెట్టి, ఓ కన్యతో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్తిక మాసం రెండు రోజులుండగా, గౌరీశంకరులుగా భావించిన నందీశ్వరుని ఓ మహిళతో ఉపవాసం ఉంచి గ్రామంలో ఊరేగించాక, గౌరీదేవీ వద్ద ప్రతిష్ఠిస్తారు. అనంతరం అఖండ దీపాన్ని వెలిగించి, మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చేనేత కార్మికులకు ఆడపడుచైన గౌరీదేవిని సారెలతో గ్రామంలోని వీధులన్ని ఊరేగిస్తారు. తర్వాత గౌరీదేవి, నందీశ్వరుని నిమజ్జనం చేస్తారు. అంతటితో గౌరీదేవి ఉత్సవాలు ముగుస్తాయి.

మండలంలోని కొత్తపల్లి, కొమరగిరి, రవీంద్రపురం, మూలపేట తదితర గ్రామాల్లో గౌరీదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠించిన నాటినుంచి ప్రతి రోజూ వివిధ వేషాలతో భక్తులను ఎంతగానో మెప్పిస్తారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. కొత్తపల్లిలో ఈ ఉత్సవాలు గురువారం జరిగే నిమజ్జనంతో ముగియనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

వరి దుబ్బే గౌరీదేవి

మనిషికి జీవనాధారమైన వ్యవసాయంలో వరి దుబ్బును గౌరీదేవిగా భావించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామంలో ప్రజలంతా సుఖసంతోషాలు, పాడిపంటలు, సౌభాగ్యంతో నిండు నూరేళ్లు వర్ధిల్లుతారనేది భక్తుల నమ్మకం. పూర్వ కాలం నుంచి గౌరీదేవిని ప్రతిష్ఠించి, నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

నందీశ్వరుని పూజతో సంతానాభివృద్ధి

గౌరీశంకరుల మహోత్సవంలో ముఖ్యమైన ఘట్టం నందీశ్వరుడు. శివపార్వతుల ప్రతిరూపంగా నందీశ్వరుని కొలుస్తారు. కార్తిక పౌర్ణమి మూడు రోజుల ముందు గౌరీశంకరుల ప్రతిరూపంగా భావించే నందీశ్వరుని ఓ మహిళతో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. గ్రామంలో ఊరేగించిన అనంతరం నందీశ్వరుని ఆ మహిళతో నిమజ్జనం చేయించడం వల్ల సంతాన భాగ్యం కలుగుతుందని పెద్దలు చెబుతుంటారు. దీంతో నందీశ్వరుని పూజించడం ఆచారంగా వస్తోంది.

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- విరవలో గడప గడపకూ మన ప్రభుత్వం



విరవలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టినా.. అది కేవలం ప్రజల కోసమేనని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం విరవలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పట్టణంలో పర్యటించిన ఆయన.. ప్రతి ఇంటి వారిని పలకరించారు. ఎవరికి, ఏ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను తీసుకురావడం కోసమే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామంటోందని, టీడీపీ వారికి ప్రజల చెంతకు పాలన వెళ్లడం ఇష్టం లేదని అవగతమవుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకూ సమన్యాయం చేస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలు రాకపోయినా తాము ఇంటింటికీ తిరిగి, ప్రజల సమస్యలు వింటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. కార్తిక మాసం స్వామి వారి జన్మనక్షత్రం ఆరుద్ర, కావడంతో తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయంలోని అన్నదాన కార్యక్రమంలో భక్తులు భోజనాలు చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, భక్త సంఘం సభ్యులు బీవీ రమణ, చల్లా సత్తిబాబు, మసకపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్ నేతల హరిబాబు భక్తులకు సేవలందించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



మేజర్ డ్రైయిన్ ప్రారంభిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పెద్దాపురం నియోజకవర్గంలో సంక్షేమ పాలన సాగిస్తున్నామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలో 16వ వార్డులో కబడ్డి వీధిలో సుమారు రూ.13 లక్షలతో నిర్మించిన మేజర్ డ్రైన్ నిర్మాణాన్ని ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ సయ్యద్ అమీనా బీబీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా రెండు పట్టణాల్లో మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగుతుందన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, తాటికొండ వెంకటలక్ష్మి, నీలంశెట్టి అమ్మాజీ, తదితరులున్నారు.

అన్నీ మరచి.. కలసి పని చేద్దాం

పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు



పిఠాపురం మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఒకరిపైఒకరు ఆరోపణలు చేయడం, వాదోపవాదాలు జరగడం సహజం. ఇకనుంచి వాటికి తావులేకుండా కలసి పనిచేద్దామంటూ కౌన్సిలర్లు పరస్పర అంగీకారానికొచ్చారు. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగింది. తొలుత అధికారులు అజెండాలో అంశాలను చదవగా, వాటిని ఆమోదిస్తూ తీర్మానించారు. ఈ సందర్భంగా గత కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన వాదోపవాదాలకు, ఆరోపణలకు ఒకరికొకరు క్షమాపణలు చెప్పుకొన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, జగ్గయ్య చెరువు కాలనీ కుళాయిల్లో మురుగు నీరు వస్తోందని అధికారులను నిలదీశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ కృష్ణవేణి సమాధానమిచ్చారు. అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చ జరగ్గా, పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పారిశుధ్య సమస్య పెరుగుతోందని, వీధి లైట్లు, డ్రైన్లు, రోడ్లు పట్టణంలో అధ్వానంగా ఉన్నాయని, వాటిని వెంటనే మెరుగు పరచాలని సభ్యులు సమావేశంలో గళమెత్తారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీజీఎం వార్షికోత్సవ ఏర్పాట్లు

పెద్దాపురం: వచ్చే నెల 17వ తేదీన నిర్వహించే క్రిష్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వార్షికోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. మండలంలోని చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో బుధవారం సీజీఎం వార్షికోత్సవ కరపత్రాన్ని క్రీస్తు ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదీప్ మాట్లాడుతూ సేవా పరిచర్యను ప్రారంభించి 11వ వార్షికోత్సవం జరుపుకొంటున్నామన్నారు. ఆంధ్రా, ఒడిశా, చత్తీస్‌ఘడ్, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల పరిధిలో సుమారు రెండు వేలకు పైగా ఏజెన్సీ తండాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతర సీజీఎం సభ్యులకు ఏకరూప దుస్తులను సత్యానందం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దైవజనురాలు నంగిన ప్రేమలత, బొందల త్రిమూర్తులు, పైడిరాజు, సత్తిబాబు, సీజీఎం బృందం సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి బాధ్యతలు తెలియజేయండి

- మాస్టర్ ట్రైనర్ల రెండో బ్యాచ్ శిక్షణ
- రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టరు మురళీ



మాస్టరు ట్రైనర్లకు శిక్షణ నిర్వహించిన మురళీ

సామర్లకోట: సచివాలయ సిబ్బందికి వారి విధులు, బాధ్యతలను తెలియజేయాలని, ఈ మేరకు వారికి శిక్షణ ఇవ్వాలని సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టరు, ముఖ్యమంత్రి మాజీ చీఫ్ సెక్రటరీ జె.మురళి అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాలోని సీనియర్ పంచాయతీ కార్యదర్శులను ఎంఓటీలుగా ఎంపిక చేసి రెండు రోజుల పాటు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణనిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మురళి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిన రెండు నుంచి మూడు నెలలోనే ఉద్యోగాలు వచ్చాయని, వారికి ఉద్యోగంలో కష్టం తెలియడంలేదన్నారు. అందుకే సచివాలయ సిబ్బంది ఉద్యోగ బాధ్యతలను తెలియజేయాలన్నారు. ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించే ముందు కోవిడ్ కారణంగా ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారని, అది సక్రమంగా వినియోగించుకోలేదన్నారు. పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా సచివాలయ సిబ్బందికి తరగతులు నిర్వహించాలని చెప్పారు. ఈ మేరకు డిసెంబరు 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ ఏజెన్సీ ప్రాంతాల్లోని సచివాయల సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి 240 మందిని ఎంపిక చేసి తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు స్థానికంగా నివాసం ఉంటే ప్రజల సమస్యలు తెలుసుకొనే వీలు ఉంటుందన్నారు. ఆ విధంగా చేయక పోవడం వల్ల స్థానిక ప్రజాప్రతినిధుల పెత్తనం ఎక్కువవుతుందన్నారు. ఈ శిక్షణ తరగతులలో విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ డిప్యూటీ డైరెక్టర్లు దోషిరెడ్డి, జి.రమణ శిక్షణ నిర్వహించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

పిఠాపురం: ఏపీ ల్యాండ్ టైటిల్ చట్టానికి వ్యతిరేకంగా పిఠాపురంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి బుధవారం ఆందోళన నిర్వహించారు. పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగ రాజారావు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించిన న్యాయవాదులు.. ఏపీ ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా మున్సిపల్ పాలక మండలి సర్వ సభ్య సమావేశంలో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి అందరూ హాజరుకావాలన్నారు.

ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి పెట్టండి

- మున్సిపల్ అధికారులకు చైర్‌పర్సన్ ఆదేశం
- అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించిన కౌన్సిల్
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తులసీ మంగ తాయారు

పెద్దాపురం: పట్టణంలో టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నట్టా.. లేనట్టా..? అసలు ఉంటే మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం జరిగేదా? టీపీఓ బదిలీ జరిగితే ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టినా చర్యలేవి..? అంటూ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులు మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో భవన నిర్మాణాలు, అనధికార లే అవుట్‌లో ఉన్న వాటిపై పర్యవేక్షణ కొరవడుతుందన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం సక్రమంగా పని చేయక మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. పట్టణంలో అనేక చోట్ల మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోక పోవడంపై మండిపడ్డారు. రెవెన్యూ సిబ్బందికి సచివాలయంలో ఉద్యోగులపై పర్యవేక్షణ లోపించిందని, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై అధికారులు పూర్తి దృష్టి సారించాలని సూచించారు. ఉన్న సిబ్బంది సేవలు వినియోగించుకుని మున్సిపల్ ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణానికి మంజూరైన ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధుల కింద చేపట్టిన అభివృద్ధి పనులపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కర్ మాట్లాడుతూ స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద ఉన్న మనోజ్ చెరువు ఆనుకుని ఉన్న స్థలంలో మరిడమ్మ యాత్రికులకు పార్కింగ్ స్థలంగా ఇస్తే యాత్రికులకు మంచి జరుగుతుందన్నారు. రెండో విడత టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు సత్వరమే అందించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, చైర్ పర్సన్ తులసీ మంగతాయారులు ఆదేశించారు. పట్టణం దోమల బెడద ఎక్కువ ఉందని సత్వరమే అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయించి దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజును ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడివేడీ చర్చ సాగింది. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కమిషనర్ జంపా సురేంద్ర, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈఈ ఆదినారాయణ, శానిటరి ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్‌ఓ చంద్రశేఖరం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు సయ్యద్ అమీనాబీబీ, పేరింశెట్టి అంబికతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న కాకినాడ డీవైఈఓ రాజు

పిఠాపురం: ఇప్పటికీ కొందరు విద్యార్థులు సిలబస్‌లో వెనుకబడి ఉన్నారని, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కాకినాడ డీవైఈఓ ఆర్జేడీ రాజు ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన బుధవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి హైస్కూలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల బయోమెట్రిక్ తీరును పరిశీలించారు. సిలబస్‌లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, మెరిట్ స్టూడెంట్లుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై హెచ్‌ఎంలు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం నాడు–నేడు పనుల తీరును పరిశీలించారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎంఈఓ–2 ప్రసాద్ ఉన్నారు.

సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన

పెద్దాపురం: ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం సీఐ రవికుమార్ అన్నారు. కాండ్రకోట నూకాలమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి పెద్దాపురం ఎస్‌ఐ వి.సురేష్ అధ్యక్షతన 'వారధి' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ చిట్టీలు, యాప్‌ల పేరుతో ప్రజలు మోసపోతున్నారన్నారు. అటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళలు ఆన్‌లైన్ షాపింగ్‌లో ఎన్నో మోసాలు ఎదుర్కొంటున్నారని, లోన్ యాప్‌లు వంటి వాటి జోలికి పోవద్దన్నారు. ఆన్‌లైన్ మోసాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని సీఐ రవికుమార్ అన్నారు. ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ ఇటీవల దివిలి, తిరుపతి, వడ్లమూరు పరిసర ప్రాంతాల్లో చిట్టీల పేరుతో ఎగనామం పెట్టడంతో చాలా మంది మోసపోయారన్నారు. ఏటిపట్టు గ్రామాల్లో చీటీల మోసం కేసులు, ఉద్యోగాలిప్పిస్తామని చీటింగ్ కేసులు నమోదవుతున్నాయన్నారు. వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే వారధి పేరిట అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఎస్‌ఐ సురేష్ అన్నారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, లక్కాకుల కృష్ణ, గవరసాని రాజశేఖర్, జగ్గరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు

- రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు
- గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్



సామర్లకోట చిన్నవీధిలో అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన దవులూరి దొరబాబు



కొండెవరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

సామర్లకోట: సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సామర్లకోట 17, 18 వార్డుల సచివాలయం పరిధిలో బుధవారం సాయంత్రం చిన్నవీధిలో మున్సిపల్ వైస్‌చైర్మన్–2 గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్ మిరియాల కరుణ మేరిలలితాబాయిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొ సచివాలయం పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును దొరబాబు ఆవిష్కరించి పార్టీ జెండా ఎగురవేశారు. వలంటీర్లకు కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్లు ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు సేపెని సురేష్, స్వయంభారపు వీరభద్రరావు, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాబును నమ్మితే.. నట్టేట మునిగినట్టే..

కొత్తపల్లి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును నమ్మితే.. నట్టేట మునగడం ఖాయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. కొండెవరం గ్రామ సచివాలయం–2లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ కిట్లను పంపిణీ చేశారు. సచివాలయంలో పథకాల బోర్డును, సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, జెండాలను పంపిణీ చేశారు. రాత్రి పల్లెనిద్ర చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మరిశెట్టి సత్తిబాబు, ఉమ్మడి జాన్, మేడిశెట్టి శ్రీరాములు, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి

సామర్లకోట: వివిధ ప్రమాదాలు, అవసరాల్లో అనేక మందికి రక్తం కావలసి ఉండగా అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలను కోల్పోతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎస్ పూర్ణచంద్రరావు, ఏజీఎం సాధినేని అనిల్ బాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రగతి మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రక్తదానం చేయడంతో కొత్త రక్తం వస్తుందని, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని చెప్పారు. ఈ మేరకు కళాశాల విద్యార్థినులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కళాశాల ప్రిన్సిపాల్ జి.నరేష్, బ్లడ్ బ్యాంకు చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ కెఎస్‌ఆర్‌కె చౌదరి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కార్యదర్శి గంగాధరుడు, మెడికల్ ఆఫీసర్ వర్చేస్వరి, ఏఓ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కియా పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

పెద్దాపురం: ఈ నెల 25, 26వ తేదీల్లో కాకినాడలో నిర్వహించిన కియా (పిల్లల పండగ) రాష్ట్ర స్థాయి పోటీల్లో పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్టు ఆ పాఠశాల డైరెక్టర్ సీ హచ్ విజయ్‌ప్రకాష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

జూనియర్ విభాగంలో డ్యాన్స్, లఘు నాటిక పోటీల్లో ప్రథమ స్థానంతో పాటు ఆయా పోటీల్లో బహుమతులు సాధించారన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ విజయ్ ప్రకాష్, జాయింట్ సెక్రటరీ సమీరా, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, అకడమిక్, కల్చరల్ కో–ఆర్డినేటర్లు అభినందించారు.